మెరుగైన సేవలందిస్తాం

రంగారెడ్డి జిల్లా సీజీఎం ఆనంద్

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 30: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందుగానే మరమ్మతు పనులను పూర్తి చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా సీజీఎం ఆనంద్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను సీజీఎం, ఎస్ఈ గోపయ్య, డీఈ రత్నాకర్‌రావు, డీఈ(లైన్స్) చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీజీఎం ఆనంద్ మాట్లాడుతూ.. సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తాత్కాలిక పెండింగ్ పనులు, మరమ్మతు పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా మరమ్మతులు చేపట్టి సరఫరా నిరంతరం అందించడానికి పనులను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గగన్‌పహాడ్ సబ్ డివిజన్ ఏఈ ఈశ్వర్‌ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

మణికొండ, జనవరి 30: రాత్రిపూట ఎవరూ లేని సమయంలో ఏటీఎంలో దొంగలు పడ్డారు. ఎంతకీ క్యాష్ రాకపోవడంతో మిషన్‌ను ధ్వంసం చేసేందుకు యత్నిస్తుండగా సైరన్ మోగింది. దీంతో అక్కడి నుంచి పరారయ్యారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ సన్‌సిటీ వద్ద ఓ ఏటీఎంలో దొంగతనం చేసేందుకు సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు యత్నిస్తుండగా సైరన్‌మోగడంతో పారిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు నార్సింగి పోలీసులకు సమాచారం అందించగా.. వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అమరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కలెక్టరేట్‌లో ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

రంగారెడ్డి, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైనవారి త్యాగాలను గుర్తిస్తూ భావితరాలకు తెలియజేయడం మన బాధ్యతని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక నేతృత్వంలో సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే దృఢ సంకల్పంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరుల త్యాగాల ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రెవెన్యూ అధికారి సంగీత, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌనం పాటిస్తున్న కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది

గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక

కంసాన్‌పల్లిలో మహిళా సాధికారత భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి
- కంసాన్‌పల్లిలో మహిళా సాధికారత భవనాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జనవరి 30 : నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులకు దీటుగా ఆర్థికంగా ఎదగాలని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా సాధికారత భవనాన్ని ఆమె ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఇప్పుడిప్పుడే మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారని.. ఇది శుభ పరిణామం అయినప్పటికీ మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఓ కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నా, సమాజంలో బలంగా నిలబడాలన్నా ఆ కుటుంబంలో మహిళలదే ప్రధాన పాత్ర అనే విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు గ్రహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలతో గ్రామీణ ప్రాంత మహిళా సంఘాలు ఉపాధి మార్గాలను ఎంచుకుని లబ్ధి పొందాలని చెప్పారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళా శక్తి ఎంతో మనందరికి తెలుసని, ప్రపంచంలోని ఎన్నో ప్రధాన సంస్థలకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల ఎదుగుదలకు తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, సర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా సందర్శనకు జల్‌శక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు

- ఆహ్వానించిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల వివరాలను వివరించిన డీఆర్డీవో

రంగారెడ్డి, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా సందర్శనకు వచ్చిన జల్‌శక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు అంకిత్ మిశ్రా(డిప్యూటీ సెక్రటరీ), అంకిత్ విశ్వకర్మ(సైంటిస్ట్)లకు మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆహ్వానం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జల్‌శక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు సమావేశమయ్యారు. జల్‌శక్తి అభియాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో జల్‌శక్తి అభియాన్ ద్వారా నీటిని నిల్వ ఉంచే ప్రయత్నంలో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోరు బావులు, చెరువులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణాలను చేపట్టి నీటిని ఒడిసిపట్టడం ద్వారా జిల్లాలో వరి పంటలు, పండ్లు, పువ్వులు సాగు చేసుకుంటున్న విధానాన్ని బృందానికి వివరించారు. జిల్లాలో తాగునీరు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. జిల్లాలోని 558 గ్రామపంచాయతీల్లో హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడంతోపాటు, నాటిన మొక్కలను సంరక్షిస్తూ పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించడం జరుగుతున్నదని వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, డీఆర్డీవో ప్రభాకర్, అడిషనల్ పీడీ నీరజ, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారి బన్సీలాల్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పవర్ ప్రజెంటేషన్ ద్వారా పనుల వివరాలను వెల్లడిస్తున్న డీఆర్డీవో ప్రభాకర్

శివాజీ నేటి తరానికి ఆదర్శం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బషీరాబాద్, జనవరి 30 : నేటితరం శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోర్విచేడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో అత్యధికంగా శివాజీ మహరాజ్ విగ్రహాలు ఉన్నాయన్నారు. యువత శివాజీని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలనిసూచించారు.

పదవికి మాత్రమే విరమణ

విరమణ అనేది పదవికి మాత్రమేనని ప్రజాసేవ చేసేందుకు కాదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాసేవ చేసేందుకు పదవి అవసరం లేదన్నారు.గ్రామంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్సీతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించినప్పుడే ప్రజలకు నిజమైన గౌరవం ఇచ్చినట్లని పేర్కొన్నారు. 97 మంది లబ్ధిదారులకు రూ.97,11,252 విలువ గల చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సర్పంచ్‌లు శోభారాణి, పద్మ, శాంతి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు.

సుగుణ స్టీల్ కంపెనీ సందర్శన

పరిగి, జనవరి 30 : పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి స్టేజీ వద్ద గల సుగుణ స్టీల్ కంపెనీని మంగళవారం వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, తహసీల్దార్ కె.ఆనందరావు సందర్శించారు. సుగుణ స్టీల్ కంపెనీ నుంచి వస్తున్న పొగతో పంటలు నాశనమవుతున్నాయని, పశువులకు ప్రమాదం వాటిల్లుతున్నదని ఆంజనేయులు అనే వ్యక్తి లోకాయుక్తలో కేసు దాఖలు చేశారు. దీంతో మంగళవారం ఆర్డీవో విజయకుమారి, పొల్యూషన్ బోర్డు అధికారి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు సుగుణ స్టీల్ కంపెనీని సందర్శించి వివరాలు సేకరించారు. రోజువారీగా స్టీల్ తయారీ, వెలువడే పొగ, ఎంత దూరం ఈ పొగ వ్యాపిస్తుంది తదితర విషయాలను పరిశీలించారు. చుట్టుపక్కల గల పంటలను జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పరిశీలించారు. ఈమేరకు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు.

కంపెనీ పక్కన ఉన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

మైసిగండి మైసమ్మతల్లి ఆలయ హుండీలు లెక్కింపు

కడ్తాల్, జనవరి 30 : మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ దేవత, శివాలయ, రామాలయాలకు సంబంధించిన హుండీల్లోని ఆదాయాన్ని మంగళవారం జిల్లా దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ సమక్షంలో మైసమ్మతల్లి వారి హుండీల లెక్కింపును నిర్వహించారు. 69 రోజులకు సంబంధించిన హుండీల్లోని ఆదాయన్ని లెక్కించగా రూ.14,12,216 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ట్రస్ట్ చైర్మన్ శిరోలీపంతూనాయక్ తెలిపారు. హుండీఆదాయాన్ని కడ్తాల్‌లోని కెనరా బ్యాంక్‌లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆర్పీ భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ సిబ్బంది యాదగిరిస్వామి, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, పత్యానాయక్, కృష్ణయ్య, బీబీచారి, శ్రీనివాస్, హర్షవర్ధన్, లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలోని హుండీల్లోని ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రసాభాసగా మణికొండ కౌన్సిల్ సమావేశం

- ఎజెండాను తిరస్కరించిన మెజార్టీ సభ్యులు
- అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ, జనవరి 30 : మణికొండ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా జరిగింది. ఐదు మాసాలుగా ప్రజాసమస్యలను గాలికొదిలి..ఇప్పుడు టేబుల్ ఎజెండా అంటూ ఏవిధంగా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారంటూ మెజార్టీ సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపాలిటీలో అధికారులు పనిచేస్తున్నారా? లేక కాలయాపన కోసం కార్యాలయానికి వచ్చి వేతనాలు పొందుతున్నారా? అంటూ మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం చివరకు కొన్ని అత్యవసర వేతనాల చెల్లింపులు తప్పా మిగతా తీర్మానాలను నిలిపివేశారు. ప్రజాపరిపాలనలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు, ఇతర అవసరాల కోసం మాత్రమే నిధులను చెల్లించేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మరోసారి సమావేశం నిర్వహించాలని పట్టుబట్టారు. పరిపాలనలో పారదర్శకత లోపించడంపై మున్సిపల్ కౌన్సిలర్లు.. కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. దీంతో కమిషనర్‌కు, సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ఎమ్మెల్యేగా పోటీ చేయడం వల్ల దాదాపు ఐదు నెలలుగా సమావేశం జరుగలేదు. మంగళవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు, అలాగే టేబుల్ ఎజెండా పైన సమాచారం ఇవ్వలేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

అదనపు కలెక్టర్ సమక్షంలో బడ్జెట్ సమావేశం

వాడివేడిగా సాగిన కౌన్సిల్ సమావేశం అనంతరం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆమోదయోగ్యంగా సభ్యులు చర్చించి పలు తీర్మానాలను ఆమోదించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీలో మంగళవారం రెండో విడత నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లంతా ఒకే తాటిపైకి వచ్చి ప్రజాసమస్యలపై సుదీర్ఘంగా చర్చించి అవసరమైన పనులకు నిధులను వెచ్చించాలని ఆమోదముద్ర వేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై రాజకీయాలకు అతీతంగా సభ్యులంతా ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గుంజుకున్నారు.. పట్టుబడ్డారు

అరెస్టయిన నిందితులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 30 : బెదిరించి సెల్‌ఫోన్లు గుంజుకున్న ముగ్గురిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మన్మోహన్‌యాదవ్ కథనం ప్రకారం.. ఈ నెల 27న మధ్యాహ్నం కుంట్లూరులో నివాసముంటున్న శివకుమార్ తన స్నేహితులు సాయితేజ, సందీప్‌తో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలోని కొహెడ గుట్ట మీద ఉన్న ఆలయం వద్ద ఫొటోలు దిగుతున్నారు. ఆ సమయంలో మీర్‌పేట నందనవనంలో ఉంటున్న కృష్ణకుమార్‌రాజు, అతడి స్నేహితులు వనస్థలిపురంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉంటున్న ఈరుగు సందీప్‌కుమార్, వనస్థలిపురంలో ఉంటున్న దాసరి సాయికిరణ్‌తో కలిసి గుట్ట వద్దకు చేరుకున్నాడు. ఫొటోలు తీసుకుంటున్న ముగ్గురిని బెదిరించి, రెండు సెల్‌ఫోన్లు, వాచ్ గుంజుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నేరానికి పాల్పడిన కృష్ణకుమార్, ఈరుగు సందీప్‌కుమార్, సాయికిరణ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, వాచ్ రికవరీ చేసుకున్నారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ర్యాలీలో పాల్గొన్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్

పరిగి, జనవరి 30 : జంతు సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.అనిల్‌కుమార్, పరిగి పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ అంకమరాజు, పరిగి మండల పశువైద్యాధికారి కె.రామకృష్ణ పేర్కొన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం పరిగిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ నం.1 ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జంతుహింసకు పాల్పడకుండా, జంతువుల పట్ల కరుణతో ఉంటూ వాటి సంరక్షణ చేపట్టాలన్నారు. వన్యప్రాణులు కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వాటిని సురక్షితమైన అటవీ ప్రాంతానికి తరలించేందుకు సహకరించాలని సూచించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని చెప్పారు. తినుబండారాలు కలిగిన ప్లాస్టిక్ కవర్లను రోడ్డుపై, ఆరుబయట పడేయరాదని, జంతువులు ప్లాస్టిక్ కవర్లు, సంచులు తినడం వల్ల చనిపోయే ప్రమాదం ఉందన్నారు. జంతు సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ నం.1 ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఏ, ఎం.కామ్ అండ్ (ఐఎస్), ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎల్ఐఎస్సీ, ఎంజే అండ్ ఎంసీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

పీజీ పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు తెలిపారు. ఎంఏ, ఎం.కామ్ అండ్ (ఐఎస్), ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఎస్సీ, ఎంజే అండ్ ఎంసీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 3వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ..

ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్షా ఫీజును వచ్చే నెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ కోర్సు మూడు, ఐదు, ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

దూరవిద్య కోర్సుల ఫలితాలు విడుదల

దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంఏ (లాంగ్వేజెస్), ఎంఏ (పీపీఎం), ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల పరీక్షా ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

మెట్రో రెండో దశ కోసం సర్వే

కారిడార్-1లో ప్రయాణికుల నుంచి వివరాలు సేకరణ

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : రెండో దశ మెట్రో కోసం క్షేత్ర స్థాయిలో సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్, సిస్ట్రా ఇండియా సంయుక్తంగా నగరంలోని వివిధ మార్గాల్లో ఈ సర్వేను చేపట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశ మెట్రోను ఏడు మార్గాల్లో నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మెట్రో రైలు సంస్థ ప్రయాణికులతో నేరుగా సర్వే చేస్తోంది. నిర్మాణం చేపట్టాల్సిన మార్గాలన్నీ ఖరారు కావడంతో వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు రూపొందించేందుకు అవసరమైన ట్రాఫిక్ అధ్యయనం, ఇతర అంశాలను పరిగణనలోకి ఈ సర్వేను మొదలుపెట్టారు. మెట్రో మొదటి దశలో నిర్మించిన కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీనగర్)లో అమీర్‌పేట ఇంటర్‌చేంజ్‌లో సర్వే సిబ్బంది మెట్రో ప్రయాణికులతో పలు అంశాలపై సర్వే నిర్వహిస్తూ వివరాలను నమోదు చేస్తున్నారు. కారిడార్‌కు అనుసంధానంగా మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు, అదే విధంగా ఎల్‌బీనగర్ నుంచి వనస్థలిపురం మీదుగా హయత్‌నగర్ వరకు రెండో దశలో మెట్రో మార్గాలను పొడిగిస్తూ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో డీపీఆర్‌ను రూపొందించేందుకు ఈ సర్వేను ఈ కారిడార్‌లో చేపట్టారు.

కుష్టు వ్యాధిపై అపోహలు పెట్టుకోవద్దు

తుర్కయాంజాల్, జనవరి 30 : కుష్టు వ్యాధిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇది మందులతో నయమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో ధరణికుమార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ పల్లె దవాఖానలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వారానికి రెండు రోజులు బీట్లు

మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

పరిగి, జనవరి 30 : పరిగి మార్కెట్‌లో ఇకమీదట వారానికి రెండు రోజులు క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. ఈమేరకు మంగళవారం పరిగిలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన రైతులు, కమీషన్ ఏజెంట్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి మంగళ, శుక్రవారాల్లో క్రయవిక్రయాలు జరిగేలా నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు ఉదయం 11 గంటల లోపు తీసుకురావాలని, మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్లు పూర్తయి, సాయంత్రానికి తూకాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతుకు కమీషన్ ఏజెంట్లు వారి ఐడీపై తక్‌పట్టీలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కమీషన్ 2 శాతం కంటే ఎక్కువ తీసుకోరాదని పేర్కొన్నారు. తరుగు సైతం క్వింటాలుకు కిలోనే తీయాలని, వ్యవసాయ ఉత్పత్తులు ప్లాట్‌ఫారంపై పోస్తే ఎలాంటి తరుగు తీయరాదన్నారు. మార్కెట్ యార్డులో సీసీ, కవర్‌షెడ్స్ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. వే బ్రిడ్జి మరమ్మతుకు కొటేషన్ ఇవ్వాలని, వెంటనే నిధులు మంజూరు చేయనున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ నామ్‌పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఇష్తికార్ అలీ, డిప్యూటీ డైరెక్టర్ పద్మ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, వికారాబాద్ జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి పాల్గొన్నారు.

సీసీని పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి